క్లుప్తంగా

గ్రావెల్ రహదారి పనులకు శంకుస్థాపన



శంకుస్థాన చేస్తున్న సర్పంచ్ కళావతి, వైఎస్సార్ సీపీ నాయకులు

అరకులోయ రూరల్: లోతేరు పంచాయతీ మారుమూల గ్రామాలైన వంతలగూడ నుంచి లిడంగి వరకు నిర్మిస్తున్న గ్రావెల్ రహదారి పనులకు సర్పంచ్ కళావతి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి రూ.15 లక్షలతో ఈ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. ఇది పూర్తయితే రవాణా కష్టాలు తొలగుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీరామ్, నొబో, జగన్నాథం, రామూర్తి, ఉపాధి ఈసీ జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

గతంలో కంటే ఉపాధి కూలి పెంపు



మట్టిని తవ్వి పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ రాజులమ్మ

కొయ్యూరు: గతంలో కంటే ప్రభుత్వం ఇప్పు డు కూలి రేటును రూ.15కు పెంచిందని చింతపల్లి ఏఎంసీ చైర్మన్ జె. రాజులమ్మ తెలిపారు. నల్లగొండలో 2023–24కు సంబంధించిన ఉపాధి పనులను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ ఈ పెంపుతో రోజుకు రూ.272 వస్తుందన్నారు. రాతికట్టు, భూమి అభివృద్ధి, చెరువులు తవ్వకంతోపాటు రైతులకు నచ్చిన మొక్కలను పెంచుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న దళిత సంక్షేమ సంఘం నాయకులు

గంగవరం: రాజవరంలో అగ్ని ప్రమాద బాధిత దళిత కుటుంబాలకు తగిన నష్ట పరిహారం అందించి న్యాయం చేయాలని దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముద్దా పిచ్చయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బహుజన సంక్షేమ పరిషత్ నాయకులు ఎ.వి.రావు, విద్యార్థి సంఘం నాయకుడు ఎం.రోహిత్‌తో కలసి ఆయన పరామర్శించారు. దళిత ఇంటలెక్చువల్ ఫోరం ఫర్ మాదిగాస్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. వీరికి పక్కా ఇల్లు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

26న సర్వసభ్య సమావేశం

హుకుంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 26న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి 29 శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలని, మండలంలో చేసిన అభివృద్ధి, వారి పనితీరుపై సమీక్ష ఉంటుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు విధిగా పాల్గొనాలన్నారు.

గ్రామసభలో వినతుల వెల్లువ

రాజవొమ్మంగి: స్థానిక మేజర్ పంచాయతీలో ప్రధాన రహదారిని వెడల్పు చేయాలని, అందుకు అనుగుణంగా డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు విన్నవించారు. సర్పంచ్ రమణి అధ్యక్షతన మంగళవారం స్థానిక సచివాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. వర్షాకాలంలో అంత్యక్రియలు కష్టంగా మారిందని, హిందూ శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని ఈ సందర్భంగా గ్రామస్తులు కోరారు. వీటితోపాటు మరికొన్ని వినతులు సమర్పించారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

గంగవరం/వై.రామవరం: జాతీయ రహదారి పనులు నేపథ్యంలో వై.రామవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాలకు బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు రంపచోడవరం డివిజన్ ఈఈ మహమ్మద్ యూసఫ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

వారపు సంత.. సమస్యల చింత!



శిథిలావస్థలో చేరిన వారపు సంత షెడ్లు



ప్రధాన రహదారిలో విక్రయిస్తున్న వ్యాపారస్తులు

- శిథిలావస్థలో వ్యాపార సముదాయాలు
- ప్రధాన రహదారుల్లోనే వ్యాపారాలు
- సౌకర్యాలు కల్పించేందుకు ప్రతిపాదనలు

అరకులోయ రూరల్: సుంకరమెట్ట వారపు సంత కనీస సౌకర్యాలకు నోచుకోలేదు. గతంలో వివిధ రకాల వ్యాపారుల సౌకర్యార్థంగా నిర్మించిన షెడ్లు శిథిలావస్థకు చేరాయి. గత్యంతరం లేక ప్రధాన రహదారులపై దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేస్తున్నారు. దాంతో ట్రాఫిక్ సమస్య మరింత పెరిగింది. మరోవైపు వారపు సంత స్థలాలను కొంత మంది ఆక్రమించడంతో మరింత ఇరుకుగా మారింది.

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి

కూరగాయలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు కోల్డ్ స్టోరేజీలు (గొడౌన్లు) నిర్మాణం చేపట్టాలని గిరిజన రైతులు కోరుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పండించిన పంట ఉత్పత్తులను తీసుకువచ్చి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మార్కెటింగ్ సౌకర్యం ఉంటే దినుసులు నిల్వ చేసి మంచి ధరలకు విక్రయించుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సౌకర్యాల కల్పనకు చర్యలు



వారపు సంతలో వ్యాపారులకు రైతులకు సౌకర్యంగా ఉండేందుకు గొడౌన్లు, తాగునీరు, కోల్డ్ స్టోరేజీలు, పార్కింగ్ స్థలం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతం వారపు సంతలో (టెండర్)ఆశీలు వసూలు చేసిన నిధులతో తాగునీరు, సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తాం. రైతులకు గిట్టుబాటు ధర వచ్చేవిధంగా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.

– కిల్లో రాజారమేష్‌బోష్, ఏఎంసీ చైర్మన్, అరకులోయ

వర్షకాలంలో మరింత ఇబ్బందులు



వారపు సంతలో షెడ్లు నిర్మాణం చేపట్టి మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుంది. వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలకు మేలు కలుగుతుంది. దీనిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

– హస్తినకుమార్, స్థానికుడు

జంతువుల వేటకు సై...

ఆయుధాలతో బయలుదేరిన గిరిజనులు



వేటకు ఆయుధాలతో బయలుదేరిన మినుములూరు గిరిజనులు

సాక్షి, పాడేరు: గిరిజన ఆచార సంప్రదాయాలు ఎంతో విశిష్టమైనవి. సాంకేతిక యుగంలోనూ వాటిని తూ.చ తప్పకుండా ఆచరిస్తూ తమలో ఐక్యతను చాటుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల పరిధిలో తాజాగా ఇటుకల పండగ ఉత్సాహంగా సాగుతోంది. తెలుగు సంవత్సరాది ఉగాది పండగ తర్వాత నెల రోజుల పాటు ఈ పండగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా పాడేరు డివిజన్ 11 మండలాల్లో వ్యవసాయ పంటలు బాగా పండాలని, గ్రామంలోని ప్రజలతోపాటు పశు సంపద ఆయురారోగ్యాలతో జీవించాలని పూర్వం నుంచి శంకుదేవుడికి పూజలు చేస్తూ.. ఒక్కొక్క గ్రామంలో ఈ పండగను ఘనంగా జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా గిరిజనులు(మగవారంతా) తమ సాంప్రదాయ విల్లంబులు, గొడ్డళ్లు, ఈటెలు, కత్తులు, నాటు తుపాకీలతో వేటకు పోయి అడవి జంతువులను వేటాడి గ్రామానికి తేవడం పండగలో ఓ తంతుగా ఉంది. దీనికి ముందు గ్రామ పొలిమేరలో గ్రామ పెద్దలంతా సాంప్రదాయ ఆయుధాలకు పూజలు చేసిన తర్వాతే బయలు దేరుతారు. అడవిలోకి మూకుమ్మడిగా వెళ్లి ఏదో ఒక జంతువును వేటాడి గ్రామానికి తీసుకురావడం ఆచారం. ఒక్క జంతువునైనా వేటాడి తీసుకురాని పక్షంలో మహిళల వద్ద అవమానం పడే పరిస్థితి ఉంటుంది. వేటాడి జంతువును తీసుకువస్తే మాత్రం ఘన స్వాగతం పలుకుతారు. వేటాడిన వన్య ప్రాణుల మాంసంతో ఏజెన్సీలోని విందు భోజనాలు చేసుకుంటారు. ఈ పండగ సమయంలో అటవీశాఖ అధికారులు గౌరవించి వారికి స్వేచ్ఛ ఇస్తారు.

25న బహిరంగ సభ

అరకులోయ రూరల్: అరకులోయ కేంద్రంగా ఈ నెల 25న నిర్వహించే సీపీఎం బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు బాలదేవ్, రామరావు కోరారు, మంగళవారం పకనగూడ, బోడిగుడ, గత్తనుగూడ, తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

- రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి



మడిచర్లలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం: మండలంలోని వాడపల్లి, మడిచర్ల గ్రామ సచివాలయ పరిధి ఇసకపట్ల, మడిచర్ల, గుజ్జుగూడెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, వాటి ద్వారా కలిగిన లబ్ధిని వివరించారు. రానున్న కాలంలో ఈ సంక్షేమ పథకాలను మరింత పకడ్బందీగా అమలు చేస్తామని తెలిపారు. అర్హత ఉండి, సంక్షేమ పథకాలు అందని వారికి, సరిచేసి వాటిని అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల పక్షపాతి అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, ఎంపీటీసీ మంగమ్మ, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ లాలీ, పార్టీ నాయకులు పండా రామకృష్ణదొర, రాజన్నదొర, సచివాలయ కన్వీనర్ కొండ్రారాజు, గృహ సారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

20న బర్రిమామిడి, కరకపాడులో..

గంగవరం: మోహనాపురం సచివాలయం పరిధి పంద్రప్రోలు పంచాయతీలో గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బి.శ్రీనివాసులు తెలిపారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ అప్పలరాజు, ఇన్‌చార్జి రఘునాథ్ విజ్ఞప్తి చేశారు.

సంక్షేమ రథసారథి సీఎం జగన్

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



పెద్దపేటలో పథకాల అమలు తీరుపై గిరిజనులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పాల్గుణ

ముంచంగిపుట్టు: సంక్షేమ రథసారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని దారెల పంచాయతీ పెద్దపేట, పేట మాలిపుట్టు గ్రామాల్లో మంగళవారం జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా 152 గడపలను ఎమ్మెల్యే పాల్గుణ సందర్శించారు. అక్కడ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాల అమలుతీరుపై అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటి వద్ద స్టిక్కర్లను అతికించారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌ను పంపిణీ చేసి ప్రభుత్వం నుంచి పొందిన పథకాలను వివరించారు. ఈ క్రమంలో సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని, గతంలో పంచాయతీ కేంద్రాలకు వెళ్లి పొందేవారమని, ఇప్పుడు నేరుగా ఇంటి వద్దే అందుతున్నాయని పలువురు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు గడప వద్దకే అందుతున్నాయని, ప్రజా సంక్షేమ పాలనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయని, ఇతర రాష్ట్రాలు ఆంధ్రను చూసి నేర్చుకునే విధంగా పాలన కొనసాగుతుందన్నారు. నాడు – నేడుతో పాఠశాలలు, ప్రభుత్వాస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. 2024లో మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి చేసి మరింత అభివృద్ధి సాధించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, పార్టీ మండలాధ్యక్షుడు పాంగి మల్లికార్జున్, ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ నర్సమ్మ, మండల నేతలు జగబంధు, మత్స్యలింగం, కొండలరావు, పులిరాజు, తిరుపతిరావు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజా సంక్షేమ ప్రభుత్వం

- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



వంజరిలో బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరువ చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. వంజరి గ్రామ సచివాలయం పరిధి ఉలవరపాడు, కొత్తూరుపాడు, వంజరి గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలు ఉత్సాహభరితంగా సాగాయి. ఆయా గ్రామాల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సంక్షేమ పథకాలు అమలు తీరును ఆమె అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో 174 గడపలను సందర్శించారు. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ఇంటి యజమానుల అనుమతితో ఇళ్లకు అంటించారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు సురభంగి రామకృష్ణ, ఎంపీటీసీ చంద్రశేఖరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయకుమార్, పీఆర్ ఏఈ మాణిక్యం, ఎంపీటీసీ కొర్రా మధు, పార్టీ మండలాధ్యక్షుడు ఎస్ మత్స్య కొండంనాయుడు, లువ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర, మాజీ సర్పంచ్ వంజరి సీతారాంనాయుడు, యువజన వంజరి శ్రీనివాసనాయుడు, కన్వీనర్లు కొండపల్లి రాజు, ప్రవీణ్‌సాయి, సూర్య ప్రకాష్‌నాయుడు, బాలయ్యపడాల్, నాయకులు పోతురాజు నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వంజరి పంచాయతీలో ..: వంజరి గ్రామ సచివాలయం పరిధిలో పద్మాపురం, పెద్దరాయి, చింతలపాడు, గొందిమెలక, బద్దెమెట్ట గ్రామాల్లో బుధవారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలు నిర్వహిస్తామని పార్టీ మండలాధ్యక్షుడు మత్స్య కొండం నాయుడు తెలిపారు. పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

జగనన్న పాలనలోనే సంక్షేమం



మారేడుమిల్లి: వేజువాడలో గిరిజనులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు



దుంబ్రిగుడ: సొవ్వ పంచాయతీలో ఇంటికి స్టిక్కర్లు అంటిస్తున్న కన్వీనర్లు, నాయకులు



కూనవరంలో జగనన్న స్టిక్కర్లు చూపిస్తున్న దృశ్యం



అరకులోయ రూరల్: అవగాహన కల్పిస్తున్న కన్వీనర్ రాధ



జి.మాడుగుల: ఏడుసావళ్లు గ్రామంలో కార్యక్రమం నిర్వహిస్తున్న సర్పంచ్ రామకృష్ణ

కూనవరం: జగనన్నే మా భవిష్యత్తులో భాగంగా కూనవరం, పంద్రాజుపల్లి గ్రామాల్లో పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని ఆరా తీశారు. వాటిపై అవగాహన కల్పించారు. ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్, మేరుకులం రాష్ట్ర డైరెక్టర్ డి. గంగాధర్, ఎంపీటీసీ కొమ్మాని అనంతలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు నోముల కొండలరావు, చినార్కూరు సర్పంచ్ సున్నం అభిరామ్, కె. మోహన్‌రావు, కె.సునీత, కె.వీర్రాజు, మున్నాఫ్, కె. కన్నమ్మ, కె. శ్రీను, జి. కన్నయ్య, గొర్రెబాబు, రాజులు, శేషమ్మ పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా మండలంలోని సొవ్వా, కంద్రుం పంచాయతీల్లో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. సచివాలయ కన్వీనర్ గణపతి, వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, సీనియర్ నాయకులు బాక సింహాచలం, నర్సింగరావు, గ్రామ కన్వీనర్లు, గృహసారథులు పాంగి నాగేశ్వరరావు, స్వాతి పాల్గొన్నారు.

మారేడుమిల్లి: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని చట్లవాడ సర్పంచ్ డి. ప్రేమలత కోరారు. జగనన్నే మా భవిష్యత్తులో భాగంగా మంగళవారం చట్లవాడ పంచాయతీ వేజువాడలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు గురించి వివరించారు. కరపత్రాలు పంపిణీ చేసి, ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. మరలా జగనన్నకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు సుందర్ పాల్, గృహ సారథులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: సుంకరమెట్ట పంచాయతీ పెదగంగుడిలో సచివాలయ కన్వీనర్ రాధ ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలపై వివరించారు. గత ప్రభుత్వానికి దీటుగా ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కన్వీనర్లు గణేష్, ప్రదీప్, గృహసారథి మాన్నసయ్య, తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని తీగలవలస, ములియపుట్టు, రంగశీల, కొట్నాపల్లి, చీకుమద్దుల పంచాయతీల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నాయకులు, కన్వీనర్లు నిర్వహించారు. తీగలవలసలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కొర్ర నాగరాజు, కన్వీనర్లు అవగాహన కల్పించారు.

జి.మాడుగుల: పాలమామిడి గ్రామ సచివాలయం పరిధి ఏడుసావళ్లు గ్రామంలో సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు సురభంగి రామకృష్ణ ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జరిగింది. ఇంటి యజమానుల అనుమతిలో స్టిక్కర్లను అంటించారు. పెదలోచలి, గడుతూరు, గెమ్మెలి, సింగర్భ, నుర్మతి భీరం పంచాయతీలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కన్వీనర్ యు.గణపతి, వైస్ సర్పంచ్ కె. రామస్వామి, గృహసారథులు పాల్గొన్నారు.

వీఆర్‌పురం: పెదమట్టపల్లి పంచాయతీ పరిధి నెహ్రూనగర్‌లో సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జి బొడ్డు సత్యనారాయణ ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు, చినమట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు, సచివాలయ కన్వీనర్లు ఉయికా శాంతమ్మ, గుంపెనపల్లి వీరాస్వామి, కారం బాబూరావు, చీమల కాంతారావు, నాయకులు మాచర్ల వెంగళరావు, ఉయికా నాగేశ్వరరావు, కోటం జయరాజ్, గృహసారథులు చిచ్చడి జయమ్మ, జోడె పిచ్చమ్మ పాల్గొన్నారు.

వై.రామవరం: దాలిపాడు గ్రామ సచివాలయం పరిధి కిమ్ముడు వారి వీధి, దాలిపాడు గ్రామాల్లో గృహసారథులు, కన్వీనర్లు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. గత ప్రభుత్వం చేసిన మోసాలను వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. 150 ఇళ్లు తిరిగారు. వైస్ ఎంపీపీ వలాల విశ్వమ్మ, సర్పంచ్ కర్ర వెంకాయమ్మ, నాయకులు పాల్గొన్నారు.

కొయ్యూరు: సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం ముందంజలో ఉందని మండల ఉపాధ్యక్షుడు అప్పన వెంకటరమణ అన్నారు. ఆయన మంగళవారం ఆడాకులలో జగనన్నే మా భవిషత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. సచివాలయ వ్యవస్థ మూలంగా అందుతున్న సేవలను తెలియజేశారు. సచివాలయ కన్వీనర్ గాడి అచ్చిరాజు, ఆర్. కొండబాబు, పీఏసీఎస్ చైర్మన్ అప్పన గజ్జయ్యదొర పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీకి ఎమ్మెల్యే పరామర్శ

ముంచంగిపుట్టు: మండలంలో కించాయిపుట్టు పంచాయతీ మినుములపుట్టు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కిముడు గాసిరావును అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నాయకులు కొండలరావు, తిరుపతి మంగళవారం పరామర్శించారు. ఇటీవల పక్షవాతం బారిన పడిన అతడు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ మేరకు ఆరోగ్య పరిస్థితిపై ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.



గాసిరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

కేశవాచార్యులు మాస్టారు మృతికి సంతాపం



కేశవాచార్యులు (ఫైల్)

గంగవరం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన విశ్రాంత ఉపాధ్యాయుడు జి.ఎ.కేశవాచార్యులు (62) రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మరణించారు. ఆయన మండలంలోని చిన్నంపాలెం, నెల్లిపూడి, భయ్యనపల్లి ప్రాథమిక పాఠశాలల్లో సుదీర్ఘకాలంగా సేవలందించి గోకవరం మండలం కామరాజుపేట హైస్కూల్‌లో పదవీ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో వారం రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మృతి చెందడంతో గంగవరం, గోకవరం మండలాలకు చెందిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు రఘుబాబు, మాజీ గౌరవాధ్యక్షుడు పి.రాంబాబు, జిల్లా కోశాధికారి కె.కృష్ణ, ఎంఈవో మల్లేశ్వరరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు డి.వి.వి సత్యనారాయణ, ఎన్.ఎం.పట్నాయక్, చిన్నికృష్ణ, డి.ఎ. పట్నాయక్, ఆదర్శ విద్యా సంస్థల అధినేత పి.కనకరాజు, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

దోమల నివారణ మందు పిచికారీ



మాలగుమ్మిలో పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

ముంచంగిపుట్టు: ఇళ్ల లోపల, బయట దోమల నివారణ మందు పిచికారీ చేయించుకోవాలని మండల మలేరియా సబ్ యూనిట్ అధికారి టి.నాగేశ్వరరావు తెలిపారు. బంగారుమెట్ట పంచాయతీ మాలగుమ్మి, బాధిపుట్టు, సోలగంపుట్టు గ్రామాల్లో మొదట విడత మలేరియా దోమల నివారణ మందు పిచికారీని ఆయన పర్యవేక్షించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో గిరిజనులకు అవగాహన కల్పించారు. మండలంలో మొదటి విడతగా లబ్బూరు, కిలగాడ పీహెచ్‌సీ పరిధిలోని ముందస్తుగా గుర్తించిన గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో కె. సుబ్రహ్మణ్యం, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, ఆశా కార్యకర్తలు, వార్డు మెంబర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఊడపాలెం గ్రామ సమస్యలు పరిష్కరించండి

జి.మాడుగుల: ఊడపాలెంలోని రోడ్డు, తాగు నీరు, డ్రైనేజీ వంటి సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంతాల నాగేశ్వరరావు కోరారు. వీటితోపాటు సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ సభ్యులు కిల్లో ధనుంజయ్, లువాబు సింహాచలం, రామూర్తి, అప్పారావు, అప్పన్నదొర, రామన్న, వలంటీర్ రాజుందొర పాల్గొన్నారు.